మట్టపర్రులో 'గడపగడపకూ మన ప్రభుత్వం'

ప్రజాశక్తి - పోడూరు

మండలంలోని మట్టపర్రులో సోమవారం 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో జిల్లా పరిషత్ ఛైర్మన్ కవురు శ్రీనివాస్ పాల్గొన్నారు. నవరత్నాల గురించి ఇంటింటికీ తిరిగి వివరించారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి గుంటూరు పెద్దిరాజు, ఎంపిపి సుమంగళి, వైస్ ఎంపిపి గుబ్బల సత్యనారాయణ, మండల కన్వీనర్ గణపతిరాజు, హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ పోతుమూడి రామచంద్రరావు, వైసిపి గ్రామాధ్యక్షుడు కొల్లబత్తుల రవిబాబు, కాటికె ఆనందబాబు తదితరులు పాల్గొన్నారు.

లస్కర్ల పాట్లు..!

ఏడు నెలలుగా అందని జీతాలు
12 నెలలు పని.. పది నెలలకే జీతాలు
ఎప్పుడో నిర్ణయించిన రూ.10,500 జీతమే ఇప్పటికీ
ప్రతినెలా జీతాలిచ్చేలా చర్యలు శూన్యం
సాగునీటి పంపిణీలో లస్కర్లదే కీలకపాత్ర

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

జిల్లా వ్యవసాయ సాగులో కీలక పాత్ర పోషిస్తున్న లస్కర్ల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి ప్రదర్శిస్తుందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఏడాదిపాటు పని చేయించుకుని పది నెలలకే జీతాలివ్వడంతోపాటు సకాలంలో జీతాలివ్వకపోవడం వంటి కారణాలతో లస్కర్లు పడుతున్న ఇబ్బందులు వర్ణనాతీతం. తమకు ప్రతినెలా జీతాలు అందించేలా చర్యలు తీసుకోవడంతోపాటు జీతాలు పెంచాలని ప్రజాప్రతినిధులు, అధికారుల చుట్టూ లస్కర్లు కాళ్లరిగేలా తిరుగుతున్నా పట్టించుకోని పరిస్థితి ఉంది. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా డెల్టా పరిధిలో 5.29 లక్షల ఎకరాల్లో వ్యవసాయ సాగు ఉంది. గోదావరి నుంచి ప్రధాన కాలువల ద్వారా వ్యవసాయ భూములకు సాగునీరు సరఫరా సాగుతోంది. ఈ నీటిని సక్రమంగా పంపిణీ చేసే బాధ్యత లస్కర్లపైనే ఉంటుంది. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 197 మంది లస్కర్లు పని చేస్తున్నారు. మొత్తం ధవళేశ్వరం డివిజన్ పరిధిలో 600 మంది వరకూ పని చేస్తున్నారు. వీరంతా కాంట్రాక్ట్ ఉద్యోగులే. జూన్ నుంచి మార్చి నెలాఖరు వరకూ పది నెలలు పని చేసే ప్రాతిపదికన వీరిని తీసుకుంటారు. అయితే పంట కాలువలు మూసేసరికి ప్రతియేటా ఏప్రిల్ నెలాఖరవుతోంది. మెయింటినెన్స్ వంటి కారణాలతో మే నెలలోనూ వీరితో అధికారులు పని చేయించుకుంటున్నారు. జీతం మాత్రం జూన్ నుంచి మార్చి వరకూ పది నెలలకు మాత్రమే ఇస్తున్నారు. ఎప్పుడో ఏళ్ల కిందట నిర్ణయించిన రూ.10,500 జీతాన్నే ఇప్పటికీ ఇస్తున్నారు. బహిరంగ మార్కెట్లో ధరలు పెద్దఎత్తున పెరిగినా లస్కర్ల జీతాల్లో మాత్రం పెంపు లేకుండాపోయింది. రెగ్యులర్ లస్కర్లకు రూ.50 వేలకుపైగా జీతాలుండగా అదేస్థాయిలో పని చేస్తున్న కాంట్రాక్ట్ పద్ధతిలో పని చేస్తున్న లస్కర్లకు మాత్రం అందులో సగం జీతం కూడా ఇవ్వని పరిస్థితి.

రబీ సీజన్‌లో కష్టాలు వర్ణనాతీతం

ప్రతియేటా రబీ సీజన్‌లో సాగునీటి కొరత వెంటాడుతూనే ఉంది. సాగునీటి కొరత కారణంగా వంతులవారీ విధానం అమలు చేసి ప్రభుత్వం పంటను గట్టెక్కిస్తోంది. రబీలో సాగునీటి పంపిణీ వ్యవహారం కత్తిమీద సాములా మారుతోంది. జనవరి నుంచి మార్చి నెలాఖరు వరకూ వంతులవారీగా నీటిని విడుదల చేసి సక్రమంగా జరుగుతుందా.. లేదా అని చూసే బాధ్యత లస్కర్లపైనే ఉంటుంది. ప్రతిరోజూ తక్కువగా లెక్కించినా కాలువల వెంట 20 నుంచి 30 కిలోమీటర్లు నడవాల్సి ఉంటుంది. ఈ విధంగా ప్రతిరోజూ కష్టపడాలి. రబీ సీజన్‌లో అటు రైతుల నుంచి, ఇటు అధికారుల నుంచి లస్కర్లపై తీవ్ర ఒత్తిడి ఉంటుంది. అర్ధరాత్రి, అపరాత్రి అని చూడకుండా కాలువల వెంట తిరిగి సాగునీరు సరఫరా అయ్యేలా చూడాలి. వ్యవసాయ సాగులో ఇంతటి కీలక పాత్ర పోషిస్తున్న లస్కర్లకు సకాలంలో జీతాలు కూడా ఇవ్వకపోవడం దారుణమనే విమర్శలు విన్పిస్తున్నాయి. ప్రతినెలా జీతాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని లస్కర్లు ఎప్పటి నుంచో కోరుతున్నారు. ప్రభుత్వంగాని, అధికారులుగాని పట్టించుకోవడం లేదు. ఒక్కో లస్కర్‌కు ఏడు నెలల జీతం రూ.73 వేలకుపైగా రావాల్సి ఉంది. ప్రతియేటా సాగునీటి సలహా మండలి సమావేశంలోనూ లస్కర్ల జీతాలపై చర్చ జరగడం, మళ్లీ అదే సమస్య పునరావృతం కావడం పరిపాటిగా మారింది. ఈ నెలాఖరునగాని, వచ్చే నెలలోగాని జిల్లా సాగునీటి సలహామండలి సమావేశం జరిగే అవకాశం ఉంది. లస్కర్ల సమస్య మళ్లీ తెరపైకి రానుంది. ఈ నేపథ్యంలో ఇప్పటికైనా లస్కర్ల సమస్యను పరిష్కరించి న్యాయం చేయాలని వారంతా కోరుతున్నారు.

సంతృప్తికరంగా వినతులు పరిష్కరించాలి

'స్పందన'లో జాయింట్ కలెక్టర్ మురళి

వినతులు స్వీకరిస్తున్న జెసి మురళి, ఇన్‌ఛార్జి డిఆర్‌ఒ దాసి రాజు

ప్రజాశక్తి - భీమవరం

ఫిర్యాదుదారులు సంతృప్తి చెందేలా 'స్పందన'లో వచ్చిన వినతులను పరిష్కరించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ జెవి.మురళి అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్లో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజలు 180 ఫిర్యాదులను అధికారులకు అందజేశారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మురళి మాట్లాడుతూ ప్రజల నుండి వచ్చిన అర్జీలను గడువులోగా పరిష్కరించేలా జిల్లా, మండలస్థాయి అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. అర్జీలను రీఓపెన్ కాకుండా స్పష్టతతో పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి డిఆర్‌ఒ దాసి రాజు, డాక్టర్ డి.మహేశ్వరరావు, డిపిఒ ఎం.నాగలత, ఐసిడిఎస్ పీడీ బి.సుజాతరాణి, వివిధ శాఖల జిల్లా అధికారులు, వయోవృద్ధుల ట్రిబ్యునల్ సభ్యులు మేకా త్రినాథ ప్రసాద్ పాల్గొన్నారు.

నరసాపురం టౌన్: స్పందన కార్యక్రమంలో 39 ఫిర్యాదులు అందాయని సబ్ కలెక్టర్ ఎం.సూర్యతేజ తెలిపారు. స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో పాలకొల్లు పట్టణానికి చెందిన సరెళ్ల రామారావు సరిహద్దు గొడవ విషయమై ఫిర్యాదు అందించారు. నరసాపురం పట్టణానికి చెందిన కె.లక్ష్మి తనకు కేటాయించిన ఇంటి స్థలానికి పట్టా ఇప్పించాలని కోరారు. వాసన శ్రీవల్లి పాస్‌బుక్ విషయమై, ఆచంట మండలం అయోధ్యలంకకు చెందిన నల్లి రామారావు తనకు డి-ఫారం పట్టా ఇప్పించాలని వినతి అందించారు. ఆయా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సబ్‌కలెక్టర్ ఆయా శాఖల అధికారులను ఆదేశించారు.

15 నుంచి ఇంటింటా సర్వే

కలెక్టర్ ప్రశాంతి

సర్వే బ్రోచర్‌ను ఆవిష్కరించిన కలెక్టర్ ప్రశాంతి, అధికారులు

ప్రజాశక్తి - భీమవరం

జాతీయ కుష్టు నివారణ కార్యక్రమంలో భాగంగా లెప్రసీ డిటెక్షన్ సర్వే ఈ నెల 15 నుండి డిసెంబర్ ఐదో తేదీ వరకు జిల్లాలో ఇంటింటా నిర్వహిస్తారని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సంబంధిత అధికారులతో జిల్లా కోఆర్డినేషన్ సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రశాంతి మాట్లాడుతూ జిల్లాలో ఇంటింటా, ప్రతి పాఠశాలలోనూ అంగన్వాడీల్లోనూ, వసతిగృహాల్లో కూడా సర్వే నిర్వహించాలని ఆదేశించారు. అనంతరం ఇంటింటా సర్వే వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. సమావేశంలో డిఎంహెచ్ఒ డి.మహేశ్వరరావు, అడిషనల్ డిఎంహెచ్ఒ బి.భానునాయక్, డిఇఒ ఆర్.వెంకటరమణ, డిపిఒ ఎం.నాగలత, ఐసిడిఎస్ పీడీ బి.సుజాతరాణి, జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి కె.శోభారాణి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నూరుశాతం ఇళ్ల నిర్మాణం చేపట్టేలా చర్యలు తీసుకోవాలి

సొంత స్థలం కలిగిన లబ్ధిదారులు నూరు శాతం ఇళ్ల నిర్మాణం చేపట్టేలా ప్రత్యేక అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. స్థానిక జిల్లా కలెక్టరేట్లో పేదల ఇళ్ల నిర్మాణంపై ప్రత్యేకాధికారులతో సోమవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఇళ్ల నిర్మాణానికి సంబంధించి ఏవైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని కోరారు. పాలకొల్లు, కోరుకొల్లు లేఅవుట్లకు సంబంధించిన అప్రోచ్ రోడ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు వెంటనే సమర్పించాలని ఆదేశించారు. ప్రతి ప్రత్యేకాధికారీ వారంలో రెండు లేఅవుట్లలో ఇళ్ల నిర్మాణాలను ప్రారంభించేలా చర్యలు చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో నరసాపురం సబ్‌కలెక్టర్ ఎం.సూర్యతేజ, భీమవరం ఆర్‌డిఒ దాసి రాజు, హౌసింగ్ పీడీ రామరాజు, వివిధ మండలాల ప్రత్యేక అధికారులు, మున్సిపల్ అధికారులు, హౌసింగ్ ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.



కొట్టుకు స్వాగతం పలుకుతున్న మహిళలు

కాపులకు పథకాలు జగన్ ఘనత

డిప్యూటీ సిఎం కొట్టు సత్యనారాయణ

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

కాపులకు పలు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ఘనత ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డిదేనని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. సోమవారం పట్టణంలోని 11వ వార్డులో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు, ఈ సందర్భంగా కొట్టు మాట్లాడుతూ కాపు నేస్తం పథకం పట్ల కాపు సామాజిక తరగతి హర్షం వ్యక్తం చేస్తుందన్నారు. ఇప్పటివరకు జగన్ చేసిన విధంగా ఎవరూ కాపులకు న్యాయం చేయలేదన్నారు. అందరికీ సముచిత న్యాయం జగన్‌తోనే సాధ్యమవుతుందన్నారు. 2024 ఎన్నికల్లో ప్రతిపక్షాలకు ప్రజలు తగిన బుద్ధి చెబుతారన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు నేతూరి గంగాధర్‌రావు పాల్గొన్నారు.

దర్భరేవు కాల్వ ఆధునికీకరణ పనులు చేపట్టాలి

రైతుసంఘం నరసాపురం మండల మహాసభ

మాట్లాడుతున్న హరేరాం

ప్రజాశక్తి - నరసాపురం

దర్భరేవు నుండి గోదావరి వరకు కాల్వ ఆధునికీకరణ పనులు వెంటనే చేపట్టాలని, గోదావరి వద్ద ఇసుక మేటలు వెంటనే తొలగించాలని ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం నరసాపురం మండల మహాసభ డిమాండ్ చేసింది. సంఘం ఐదో మండల మహాసభ స్థానిక మీరా గ్రంథాలయంలో సోమవారం జరిగింది. సభకు గుత్తుల శ్రీరామచంద్రుడు, బి.శ్రీనివాసరావు అధ్యక్షవర్గంగా వ్యవహరించారు. సంఘం జిల్లా కార్యదర్శి ఆకుల హరేరాం, నేత కవురు పెద్దిరాజు మాట్లాడుతూ ఎంతోకాలంగా కాలువల ఆధునికీకరణ పనులు చేపట్టాలని అధికారులకు, ప్రజాప్రతినిధులకు విన్నవించుకున్నప్పటికీ సమస్యను పరిష్కరించకుండా చోద్యం చూస్తున్నారని విమర్శించారు. మండలంలో ఇప్పటికీ సార్వా సాగు లేకుండాపోయిందని, దాళ్వా సాగుకూ ఇబ్బందిగా ఉందని తెలిపారు. సార్వా సాగు చేయని రైతులందరికీ దాళ్వా సాగుకు ఉచితంగా విత్తనాలు సరఫరా చేయాలని కోరారు. ఎరువులు, పురుగుమందులు సబ్సిడీపై రైతుభరోసా కేంద్రాల ద్వారా అందించాలని విజ్ఞప్తి చేశారు. ఆక్వా రైతులకు ప్రభుత్వం ప్రకటించిన ధర రూ.240 వచ్చేటట్లుగా చర్యలు చేపట్టాలని కోరారు. దళారులు సిండికేట్ అయ్యి కౌంట్లు ప్రకారం ధర రూ.210కి మించి ఇవ్వడం లేదని, ఒక్కోసారి రూ.180 కూడా ఇస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చిన్న, సన్నకారు ఆక్వా రైతులకు ఉపయోగపడేటట్లు కోల్డ్‌స్టోరేజీలు నిర్మించాలని కోరారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షులుగా వెన్న సింహాచలం, కార్యదర్శిగా గుత్తుల శ్రీరామచంద్రుడు, సభ్యులుగా గుత్తుల సరస్వతి, దివి శివాజీ, తుమ్మ సూర్యనారాయణ, సానబోయిన దొరయ్య, కె.రామారావు, భారతుల నాగేశ్వరరావు, తోట శేషగిరి, వేంద్ర తాతయ్య, కడలి పెద్దిరాజు ఎన్నికయ్యారు.

దేవాలయ కౌలురైతుల సమస్యలు పరిష్కరించాలి

కలెక్టరేట్ వద్ద ధర్నా

నినదిస్తున్న కౌలు రైతులు

ప్రజాశక్తి - భీమవరం

జిల్లాలోని దేవాలయ కౌలురైతుల సమస్యలు పరిష్కరించాలని కౌలు రైతుల సంఘం జిల్లా కార్యదర్శి మామిడిశెట్టి రామాంజనేయులు డిమాండ్ చేశారు. దేవాలయ కౌలురైతుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ స్థానిక కలెక్టరేట్ వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. ధర్నానుద్దేశించి రామాంజనేయులు మాట్లాడుతూ మండల కేంద్రమైన ఇరగవరంలోని శ్రీ కేశవస్వామి, శ్రీ ఉమాపాలేశ్వరస్వామి వార్ల దేవస్థానం, కంతేరులోని శ్రీ వేణుగోపాలస్వామి, శివాలయానికి చెందిన భూములను సాగు చేస్తున్న కౌలురైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ దేవాలయాల పరిధిలో 80 ఎకరాలకుపైబడి 20 మంది కౌలురైతులు సాగు చేస్తున్నారన్నారు. సంవత్సరానికి ఎకరాకు రూ.40 వేల నుంచి రూ.54 వేలు వరకూ కౌలు చెల్లిస్తున్నారని తెలిపారు. అయితే గత సార్వా పంట చేతికొచ్చే సమయంలో అధిక వర్షాలు, తుఫాన్లు కారణంగా పంటను పూర్తిగా కోల్పోయారన్నారు. ఈ దశలో రెండో పంటకు అప్పు తీసుకురావడం, పంట అమ్మిన డబ్బు నాలుగు నెలలు వరకు రాకపోవడం వల్ల తెచ్చిన అప్పులకు వడ్డీలు పెరిగి కౌలు చెల్లించే పరిస్థితి లేదన్నారు. కౌలురైతులు కర్రి నాగిరెడ్డి, వీరవల్లి నాగేశ్వరరావు మాట్లాడుతూ కౌలు గుర్తింపు కార్డులున్నా బ్యాంకు అధికారులు పంట రుణాలు ఇవ్వడం లేదన్నారు. దీనికితోడు పంట నష్ట పరిహారం, పంటల బీమా, రైతుభరోసా వంటి రాయితీలేవీ ఇవ్వడం లేదన్నారు. అనంతరం కౌలురైతుల సమస్యలు పరిష్కరించాలని జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో గవర నాగేశ్వరరావు, గుడిమెట్ల భాస్కరరెడ్డి, గనసాల నర్సన్న, బుర్రా ఆంజనేయులు, కేతా పాటేశ్వరరావు పాల్గొన్నారు.

రాజ్యాంగ ఫలాలు దళితులకు అందాలి

కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి కె.క్రాంతిబాబు

మాట్లాడుతున్న క్రాంతిబాబు

ప్రజాశక్తి - కాళ్ల

రాజ్యాంగ ఫలాలను దళితులకు అందేలా పోరాడటమే కెవిపిఎస్ లక్ష్యమని ఆ సంఘం జిల్లా కార్యదర్శి కె.క్రాంతిబాబు అన్నారు. మండల కేంద్రమైన కాళ్లలో కెవిపిఎస్ మండల మహాసభ సోమవారం నిర్వహించారు. ముఖ్యఅతిథి క్రాంతిబాబు మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చి 76 ఏళ్లు గడిచినా నేటికీ దళితుల స్థితిగతులు మారలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తరతరాలుగా దళితులపై అఘాయిత్యాలు ఆగడం లేదన్నారు. కులవివక్ష, అంటరానితనం నిర్మూలన కేవలం పుస్తకాలకే పరిమితమయ్యాయని విమర్శించారు. రాజ్యాంగపరంగా లభించిన హక్కులను సైతం దేశంలో అధికారంలో ఉన్న మనువాద మతోన్మాద బిజెపి ప్రభుత్వం పూర్తిగా నిర్వీర్యం చేస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. దళితులు ఆర్థిక, సామాజిక, రాజకీయంగా సమానత్వం సాధించేలా ప్రభుత్వాలు కృషి చేయాలన్నారు. జిల్లా సహాయ కార్యదర్శి బత్తుల విజయ్‌కుమార్, సిఐటియు జిల్లా నాయకులు గొర్ల రామకృష్ణ మాట్లాడుతూ దళితులపై దాడులు, అత్యాచారాలకు వ్యతిరేకంగా అంతా ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. మండల అధ్యక్ష కార్యదర్శులుగా బాతు రామస్వామి, ఎస్.రవికుమార్, ఉపాధ్యక్షులుగా సిహెచ్.ఏసురత్నం, సహాయ కార్యదర్శులుగా ఇసుకపాటి ఏసురాజు, ఐ.రాజేంద్రప్రసాద్ ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో నాయకులు లాజర్, ఆనందరావు, ప్రేమ్, యెహోషువా, దాసు, రాజు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న శివరామభద్రరాజు

రెడ్‌క్రాస్ సొసైటీలో సభ్యులుగా చేరాలి

ప్రజాశక్తి - భీమవరం

ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీలో సభ్యులుగా అధిక సంఖ్యలో చేరి నిధులు సమకూర్చేందుకు సహకరించాలని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా అధ్యక్షులు డాక్టర్ ఎంఎస్‌వి.శివరామభద్రరాజు కోరారు. సోమవారం జిల్లా కలెక్టరేట్‌లోని అధికారులతో ఆయన సోమవారం మాట్లాడారు. జిల్లా అధికారులందరూ సభ్యత్వం నమోదు చేసుకోవాలని కోరారు. రూ.రెండు లక్షల ఫండ్ రైజింగ్ చేసిన వారికి రాష్ట్ర గవర్నర్ చేతుల మీదుగా బంగారు పతకం ఇప్పిస్తామన్నారు. తణుకు, నరసాపురంలో రెండు బ్లడ్ బ్యాంక్‌లు ఉన్నాయని, నూతనంగా భీమవరంలో బ్లడ్‌బ్యాంక్ ఏర్పాటు చేస్తున్నామని, దీనికి ఇండియన్ రెడ్‌క్రాస్ రూ.కోటి మంజూరు చేసిందని చెప్పారు. దీనికి సంబంధించి పనులు ప్రారంభించామన్నారు. కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ జెవి.మురళీ, ఇన్‌ఛార్జి డిఆర్‌ఒ దాసి రాజు, డిఎంహెచ్ఒ డాక్టర్ డి.మహేశ్వరరావు, డిపిఒ ఎం.నాగలత, ఐసిడిఎస్ పీడీ బి.సుజాతరాణి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

కుల దూషణ కేసులో ఫైర్ సిబ్బంది అరెస్టు కోరుతూ ధర్నా

ధర్నాలో నినదిస్తున్న నేతలు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

కులం పేరుతో ఫైర్ కానిస్టేబుల్ సాగర్ బాబును దూషించిన ఫైరాఫీసర్ రామారావును, ఇద్దరు సిబ్బందిని విధుల నుంచి తప్పించి, తక్షణమే అరెస్ట్ చేయాలని కోరుతూ స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద దళిత, ప్రజాసంఘాల నాయకులు సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర కార్యదర్శి కళింగ లక్ష్మణరావు మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చి 75 సంవత్సరాలు గడుస్తున్నా నేటికీ ప్రభుత్వ కార్యాలయాల్లో కుల వివక్ష కొనసాగడం దారుణమన్నారు. కుల నిర్మూలన పోరాట సమితి జిల్లా అధ్యక్షులు జాన్‌రాజ్ మాట్లాడుతూ ఫైర్ ఆఫీసర్ రామారావు తోటి సిబ్బందిని వివక్షకు గురిచేయడం దారుణమన్నారు. రామారావుపై తక్షణం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బహుజనసేన రాష్ట్ర నాయకులు గుంపుల సత్యకృష్ణ మాట్లాడుతూ ఫైరాఫీసర్ రామారావుపై గతంలోకూడా పలు అవినీతి ఆరోపణలు ఉన్నాయన్నారు. సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు మండల నాగేశ్వరరావు మాట్లాడారు. అనంతరం తహశీల్దార్ అప్పారావుకు, టౌన్ సిఐ నాగరాజుకు వినతి పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి ఉల్లింక జయకృష్ణ, బి.లక్ష్మీనారాయణ, గంగాభవాని, జాలిపర్తి వెంకట్రావు, దళిత, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ముమ్మరంగా వరి కోతలు

వరికోతల్లో నిమగ్నమైన కూలీలు

ప్రజాశక్తి - పెనుమంట్ర

సార్వా వరి కోతలు మండలంలో ముమ్మరంగా సాగుతున్నాయి. ప్రస్తుతం నెలమూరు, ఓడూరు, భట్లమగుటూరు, పొలమూరు తదితర గ్రామాల్లో రైతులు వరి కోతలు ప్రారంభించారు. మండలంలో 13 వేల 50 ఎకరాల్లో రైతులు స్వర్ణ, పిఎల్‌ఎ 1100, 1318 వంటి రకాలు సాగు చేశారు. ప్రస్తుతం వాతావరణం అనుకూలంగా ఉండడంతో కోతలు సాఫీగా సాగుతున్నాయని రైతులు చెబుతున్నారు.

ఐదు రకాలుగా రోగి నుంచి అభిప్రాయ సేకరణ

'ప్రజాశక్తి' కథనానికి స్పందన

ప్రజాశక్తి - ఏలూరు

ఆరోగ్యశ్రీ కింద అడ్మిషన్ సమయంలో రోగి, వారి వద్ద ఉండే అటెండర్ల నుంచి ఆరోగ్యమిత్రలు కౌన్సెలింగ్ లేఖను తీసుకోవడమే కాకుండా, డిశ్చార్జ్ అయిన తర్వాత రోగినుంచి ఐదు రకాలుగా అభిప్రాయ సేకరణ చేస్తారని ఆరోగ్యశ్రీ జిల్లా కోఆర్డినేటర్ టి.ఆండ్రూఏలూయిస్ తెలిపారు. ఈ నెల ఆరో తేదీన 'ఆరోగ్యశ్రీలోనూ దోపిడీ' అంటూ 'ప్రజాశక్తి'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. అందుకు సంబంధించిన వివరణ తెలిపారు. తణుకు పీడియాట్రిక్ ఎంపానెల్డ్ ఆసుపత్రిని సందర్శించిన సమయంలో బెడ్‌పై ఉన్న మూడు కేసులు కవర్ చేయబడవని తేలినట్లు తెలిపారు. ఆర్థో, ట్రామా కేసులకు సంబంధించి తమకు ఎటువంటి ఫిర్యాదులూ అందలేదన్నారు. రోగికి మెరుగైన ఇంప్లాంట్లు పెట్టడం కోసం కౌన్సెలింగ్ చేయబోతున్నట్లు వివరించారు. ఆసుపత్రుల్లో ఏదైనా ఫిర్యాదు అందితే అదే డిడిసిలో ఉంచుతారని, ఆ ఆసుపత్రికి జరిమానా విధిస్తారని తెలిపారు. అన్ని ఆసుపత్రుల్లో మిత్రలు ట్రస్ట్ పోర్టల్ ద్వారా అందించిన ఫీడ్‌బ్యాక్ ఫారంను రోగి నుంచి తీసుకున్న తర్వాత మాత్రమే డిశ్చార్జి ప్రక్రియ పూర్తవుతోందని తెలిపారు. ప్రతి రోగికీ 13 ప్రశ్నలతో కూడిన సమాధానాలను అప్‌లోడ్ చేస్తారన్నారు. అడ్మిషన్ సమయంలో రోగి, అటెండర్ల నుంచి ఆరోగ్యమిత్ర కౌన్సెలింగ్ లేఖను తీసుకుంటారని, డిశ్చార్జి అయిన తర్వాత రోగి నుంచి డిశ్చార్జి ఫీడ్‌బ్యాక్ లెటర్, ఐవిఆర్‌ఎస్ కాల్స్, 104 అవుట్‌బౌండ్ కాల్స్, 104 ఇన్‌బౌండ్ కాల్స్ ద్వారా అభిప్రాయ సేకరణ జరుగుతోందన్నారు. అన్ని నెట్‌వర్క్ ఆసుపత్రుల్లోనూ ఫోన్ నెంబర్లు ప్రదర్శిస్తామని, ప్రతి కియోస్క్‌లో ఫిర్యాదు కోసం 104 కాల్‌సెంటర్ పోస్టర్ అతికిస్తామని తెలిపారు. ట్రస్ట్ మార్గదర్శకాల లబ్ధిదారులకు నగదురహిత చికిత్స అందించాలని ఆరోగ్యశ్రీ ఎంప్యానెల్డ్ నెట్‌వర్క్ ఆసుపత్రులకు సర్క్యులర్ జారీచేసినట్లు తెలిపారు.

డిఎన్‌ఆర్‌లో అక్రమ ఫీజుల దోపిడీని అరికట్టాలి

ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి డి.పెద్దిరాజు

ప్రజాశక్తి - భీమవరం

దంతులూరి నారాయణరాజు కళాశాల (డిఎన్‌ఆర్)లో విద్యార్థుల దగ్గర నుండి యాజమాన్యం అక్రమంగా వసూలు చేస్తున్న ఫీజుల దోపిడీని అరికట్టాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి డి.పెద్దిరాజు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఎంతో మంది దాతలు సేవా దృక్పథంతో ప్రారంభించిన కళాశాలలో నేడు విద్యార్థుల దగ్గర నుండి వివిధ రకాల కోర్సుల పేర్లు చెప్పి అక్రమంగా రూ.మూడు వేల నుంచి రూ.ఐదు వేల వరకు వసూలు చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ ఫీజుల పెంపునకు వ్యతిరేకంగా గతంలో ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో విద్యార్థులు పోరాటం చేస్తే కళాశాల అధ్యక్షులు గోకరాజు నరసింహరాజు వచ్చి ఇప్పటి నుండి ఎటువంటి ఫీజులూ పెంచబోమని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. అయితే ప్రస్తుతం మళ్లీ యాజమాన్యం విద్యార్థులకు ఇచ్చిన మాట తప్పి ఫీజులు పెంచడం సిగ్గుచేటని విమర్శించారు. ఫీజు చెల్లించకపోతే జగనన్న వసతి దీవెన, విద్యాదీవెన పున:ప్రారంభానికి విద్యార్థుల వేలిముద్రలు వేయకుండా ఆపివేస్తున్నారని ఆరోపించారు. కళాశాలలో జరుగుతున్న ఫీజుల దోపిడీ గురించి అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా ఫలితం లేదని విమర్శించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అక్రమ ఫీజుల దోపిడీని అరికట్టాలని, లేనిపక్షంలో పెద్దఎత్తున ఆందోళనా కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.



జి.సత్యనారాయణను సత్కరిస్తున్న వక్తలు

సత్యనారాయణకు సత్కారం

ప్రజాశక్తి - పాలకొల్లు

అనకాపల్లి జిల్లా చోడవరం చిత్ర కళా నిలయం వారు నిర్వహించిన జాతీయ స్థాయి చిత్ర కళా ప్రదర్శనలో పాలకొల్లు సీనియర్ చిత్రకారులు గొన్నాబతుల సత్యనారాయణ అనకాపల్లి ఎంపీ డాక్టర్ బివి.సత్యవతి చేతులమీదుగా సత్కారం అందుకున్నారు. సత్యనారాయన చిత్రించిన 32 మంది భారత స్వతంత్ర సమరయోధులు, దేశ నాయకుల చిత్రాలకు మంచి స్పందన లభించింది. జాతీయ బెస్ట్ క్రియేటివ్ అవార్డులకు ఆయన అనుచరులు కొసన భాస్కరరావు, కడలి శ్రీనివాస్ ఎంపికయ్యారు. చెల్లుబోయిన రాము, వక్క వెంకట్, బి.రామారావు, రవిలకు వివిధ కేటగిరిల్లో అవార్డులు దక్కాయి. అవార్డులను విశాఖ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ రామ్‌నగర్ చేతులు మీదుగా అందుకున్నారు. పాలకొల్లు ఖ్యాతిని దేశావ్యాప్తం చేసిన వీరిని పలువురు రాజకీయ, కళారంగం, స్వచ్ఛంద సంస్థలు, ఛాంబర్ సభ్యులు అభినందించారు.



అగ్ని ప్రమాద బాధితులకు నిత్యావసర సరుకులు అందిస్తున్న లావణ్య

అగ్ని ప్రమాద బాధితులకు సాయం

ప్రజాశక్తి - ఆచంట

వల్లూరు పంచాయతీ పరిధి రాపాకవారిపాలెంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఇటీవల రెండు తాటాకిళ్లు దగ్ధమయ్యాయి. బాధిత కుటుంబాలను ఆచంట మార్కెట్ యార్డ్ చైర్‌పర్సన్ చిల్లే లావణ్య సోమవారం పరామర్శించారు. ఆ రెండు కుటుంబ సభ్యులకు నిత్యావసర వస్తువులు, సామగ్రితో పాటు ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా లావణ్య మాట్లాడుతూ ప్రభుత్వపరంగా ఇల్లు కట్టించేందుకు ఏర్పాటు చేస్తానని బాధితులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి సభ్యులు ఏడిద రామలక్ష్మి, సొసైటీ అధ్యక్షులు నారిన వీర వెంకట సత్యనారాయణ, పర్సన్స్ పెచ్చెట్టి సత్యనారాయణ, గంగోలి శ్రీను, నాయకులు మైలే ఏసురత్నం, బొక్క శ్రీను, జయ బాబు, పంది మసేన్ పాల్గొన్నారు.

ఆలయానికి వెండి మకర తోరణం బహూకరణ

ప్రజాశక్తి - కాళ్ల

వెండి మకర తోరణం అందిస్తున్న దాతలు

కాళ్ల గ్రామంలోని గంగా పార్వతి సమేత సోమేశ్వర ఆలయానికి రూ.రెండు లక్షల విలువైన వెండి మకర తోరణాన్ని దాతలు సోమవారం అందించారు. కాళ్ల గ్రామానికి చెందిన గనిశెట్టి వెంకట బెనర్జీ, నాగమణి దంపతులు, వారి అల్లుడు, కుమార్తెలు దంగేటి సురేష్, వెంకటజ్యోతిశ్రీదేవి దంపతులు, పంజా విజయ్ కుమార్‌దేవి నాగ వెంకట రత్న మాణిక్యం దంపతులు సుమారు రూ.రెండు లక్షల వ్యయమైన 2.5 కేజీల వెండితో మకర తోరణాన్ని తయారు చేయించి పూజా కార్యక్రమాలు నిర్వహించి స్వామివారికి అలంకరించారు. ఆలయ కమిటీ ఛైర్మన్ గనిశెట్టి షణ్ముఖేశ్వరరావు, ఆలయ ఇఒ కూచంపూడి శ్రీనివాసరాజులు దాతలను సత్కరించారు. అర్చకులు తుమ్మపూడి శేఖర్‌శర్మ, శివ శర్మ వేదాశీర్వచనంతో ఆశీస్సులు అందుకున్నారు.

వెంకటేశ్వరరావుకు పలువురి అభినందన

ప్రజాశక్తి - పాలకొల్లు

శ్రీకాకుళం రంగ స్థల కళాకారుల సమాఖ్య ఆధ్వర్యంలో నవంబర్ 4, 5, 6 తేదీల్లో శ్రీకాకుళంలో నిర్వహించిన నాటిక పోటీల్లో చిలకలూరిపేటకు చెందిన అంజన రాథోడ్ ఆర్ట్ క్రియేషన్స్ వారి నాన్నా! నే వచ్చేస్తా నాటికకు ఉత్తమ ప్రదర్శన బహుమతి లభించింది. ఈ నాటికకు ఉత్తమ రచనగా పాలకొల్లుకు చెందిన తాళా బత్తుల వెంకటేశ్వరరావుకు, ఉత్తమ దర్శకుడుగా ఆర్ఎస్ఆర్.నాయక్‌కు, ఉత్తమ నటిగా ఎస్.అమృతవర్షిణికి, ఉత్తమ సహాయ నటుడుగా హసన్‌కు బహుమతులు లభించాయి. ఈ సందర్భంగా తాళాబత్తులను పాలకొల్లు నటీనట సమాఖ్య కళాకారులు వివిధ పార్టీల నేతలు, యుటిఎఫ్ నేతలు అభినందించారు.

టిడ్కో ఇళ్లు ఇవ్వాలని ఎంఎల్ఎ నిరసన

ప్రజాశక్తి - పాలకొల్లు

సొంతింటి కల నెరవేర్చాలనే ఉద్దేశంతో టిడిపి హయాంలో పాలకొల్లులో ఏడు వేల ఎన్‌టిఆర్ టిడ్కో ఇళ్ల నిర్మాణం 90 శాతం పూర్తి చేశామని, మిగిలిన పది శాతం పూర్తి చేసి పేదలకు ఇవ్వాలని ఎంఎల్‌ఎ నిమ్మల రామానాయుడు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం తెల్లవారుజామున 21వ వార్డులో ఇంటింటికి సైకిల్‌పై పేపర్ వేసి నిరసన తెలిపారు. పేదలకు అద్దెభారం తగ్గించాలని, ఆఖరి లబ్ధిదారుడు సొంత ఇంటికి వెళ్లేవరకు తన నిరసన ప్రతినెలా కొనసాగుతుందని చెప్పారు. పెదగరువులో మంజూరు చేసిన 640 ఇళ్ల రద్దు చేసి పేదవారి సొంత ఇంటి కల నీరుగార్చారని చెప్పారు.

లోక్ అదాలత్‌లో అధిక కేసులు రాజీ చేయాలి

ప్రజాశక్తి - తణుకురూరల్

కక్షిదారుల ఇరు గ్రూపులతో చర్చించి ఈ నెల 12వ తేదీన నిర్వహించే జాతీ లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు రాజీకి ప్రయత్నించాలని తణుకు ఒకటో అదనపు జూనియర్ సివిల్ జడ్జి పి.బాబు అన్నారు. తణుకు మండల లీగల్ సర్వీసెస్ కమిటీ ఛైర్మన్, నాలుగో అదనపు జిల్లా జడ్జి విఎస్ఎస్.శ్రీనివాసశర్మ ఆధ్వర్యంలో కోర్టు ఆవరణలో న్యాయవాదులతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి బాబు మాట్లాడుతూ ఇరు గ్రూపులకు కేసును రాజీ చేస్తే వారి సమయం, డబ్బు ఆదా అవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు పాల్గొన్నారు.

దోమల వ్యాప్తిని అరికట్టాలి

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

దోమల ద్వారా అనేక వ్యాధులు వ్యాపిస్తాయని మలేరియా సబ్ యూనిట్ అధికారి ఏలూరి వెంకటలక్ష్మణరావు అన్నారు. మండలంలోని కడకట్ల, యాగర్లపల్లి, వికర్స్ కాలనీ, ఎన్‌టిఆర్ జంక్షన్‌లలో ఆశావర్కర్లకు సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజారోగ్యానికి ప్రధాన శత్రువులు దోమలు అని అన్నారు. దోమల ఉధృతి పెరగకుండా ఆపే బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందన్నారు. ప్రతి శుక్రవారం నిర్వహించే డ్రై డేపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఆశాలత, డాక్టర్ చైతన్య, ఆశ నోడల్ అధికారులు పాల్గొన్నారు.

టిడిపి కార్యకర్తలకు పితాని దిశానిర్దేశం

ప్రజాశక్తి - పెనుగొండ

మండలంలోని వడలి గ్రామంలో సోమవారం నిర్వహించిన టిడిపి కార్యకర్తల సమీక్షా సమావేశంలో మాజీ మంత్రి పితాని సత్యనారాయణ మాట్లాడుతూ ప్రస్తుత ప్రభుత్వ కక్షపూరిత, ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించారు. టిడిపి కార్యకర్తలు, నాయకులు సంయమనం పాటించి ముందడుగు వేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గణపతినీడి రాంబాబు, పొడూరి సత్యనారాయణ, టిడిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

కాళ్లలో 360 ఎకరాల్లో వరి పంట నష్టం

వర్షాలు, ఈదురు గాలులకు నేలకొరిగిన వరి
చేలల్లో నిలిచిన నీరు
ఆవేదనలో రైతులు

నేలకొరిగిన వరి దుబ్బులను కట్టలుగా కడుతున్న కౌలు రైతులు

ప్రజాశక్తి - కాళ్ల

ఇటీవల కురిసిన వర్షాలకు, ఈదురు గాలులకు వరి చేలు నేలకొరిగాయి. వర్షం కురిసిన సమయంలో కొద్దిగా ఒరిగిన వరి చివరికి పూర్తిగా వాలింది. మండలంలో 4,628 ఎకరాల్లో ఖరీఫ్ సాగవుతోంది. సుమారు 360 ఎకరాల్లో వర్షాల వల్ల నీట మునిగి దెబ్బతిన్నట్లు అధికారులు అంచనాలు సిద్ధం చేస్తున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు, ఈదురు గాలులకు మండలంలో పలు గ్రామాల్లో ఇదే పరిస్థితి. పంట, మురుగు కాలువల వెంబడి ఉన్న భూముల్లో ఈ పరిస్థితి కనిపిస్తుంది. ఈనిక దశ, గింజ పాలు పోసుకునే సమయంలో వరి చేలు నేలకు ఒరగడంతో రైతులు, కౌలు రైతులు ఆందోళన చెందుతున్నారు. దిగుబడి తగ్గుతుందని వాపోతున్నారు. ఈ సీజన్‌లో పలు దఫాలుగా అల్పపీడన ప్రభావాల వల్ల కురిసిన వర్షాలు రైతులను, కౌలు కౌలు రైతులను ఇబ్బందులకు గురి చేశాయి. వరి పైరు ఈనిక దశలో వర్షాలు కురవడంతో నేలనంటే పరిస్థితి వచ్చిందని వాపోతున్నారు. సంపత్, జైశ్రీరామ్ వరి రకాలను సాగు చేసిన ఆయకట్టుల్లో ఈ ప్రభావం కనిపిస్తుంది. కోపల్లె, వేం పాడు, పెదఅమిరం, బొండాడ, సీసలి, కాళ్ల, కాళ్లకూరు, ఏలూరుపాడు గ్రామంలో పల్లపు ప్రాంతాల్లో వరి చేలల్లో వర్షపు నీరు ఉండడంతో నీటిని బయటికి పంపేపనిలో రైతులు, కౌలు రైతులు నిమగ్నమయ్యారు. వర్షాలు, ఈదురు గాలుల ప్రభావం వల్ల మూడు నుంచి నాలుగు బస్తాల దిగుబడి తగ్గడమే కాకుండా మసూళ్ల ఖర్చులు కూడా పెరుగుతాయని రైతులు ఆవేదన చెందుతున్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి సోషలిజం ఒక్కటే మార్గం

సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు గోపాలన్

ప్రజాశక్తి- భీమవరం

భీమవరంలో నినాదాలు చేస్తున్న సిపిఎం నాయకులు

తాడేపల్లిగూడెంలో మాట్లాడుతున్న సిఐటియు నాయకులు

ప్రజా సమస్యల పరిష్కారానికి సోషలిజం ఒక్కటే మార్గమని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జెఎన్‌వి.గోపాలన్ అన్నారు. స్థానిక మెంటేవారితోటలోని సుందరయ్య భవనంలో అక్టోబర్ విప్లవం జయప్రదానికి చిహ్నంగా ఆయన సిపిఎం జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. 105 ఏళ్ల క్రితం 1917లో రష్యాలో శ్రామిక వర్గ రాజ్యం ఏర్పడిందన్నారు. నాటి జార్ నియంతృత్వ పోకడలకు నిరసనగా లెనిన్ సారథ్యంలో ఆ దేశంలోని కార్మికులు, రైతులు, సకలజనులు ఏకమై రష్యాలో రాచరిక పాలనకు చరమగీతం పాడారన్నారు. నాటి నుంచి 1990 వరకు ఏకధాటిన రష్యాలో సోషలిజం రాజ్యమేలిందన్నారు. నాడు రష్యా అనేక వర్ధమాన దేశాలకు ఎంతో అండగా నిలిచిందన్నారు. ప్రజా సమస్యలకు ఎర్రజెండా ఒక్కటే మార్గమన్నారు. అదే స్ఫూర్తిని భారతదేశంలో కూడా కొనసాగించి పీడిత ప్రజల విముక్తికి పోరాడాలని పిలునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బి.వాసుదేవరావు, జిల్లా కమిటీ సభ్యులు ఎం.వైకుంఠరావు, జె.సత్యనారాయణ, నాయకులు జి.రఫాయేలు, కె.రత్నకుమారి పాల్గొన్నారు.

తణుకు రూరల్ : అక్టోబర్ విప్లవం విజయవంతం లాగానే నేడు మోడీ పాలన నుంచి ప్రజల విముక్తి కోసం ఉద్యమించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పివి.ప్రతాప్ కోరారు. స్థానిక అమరవీరుల భవనంలో నవంబరు ఏడు అక్టోబర్ విప్లవ దినోత్సవం సందర్భంగా కె.నాగరత్నం అధ్యక్షతన సోమవారం సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతాప్ మాట్లాడుతూ అక్టోబర్ విప్లవం జరిగి 105 ఏళ్లు పూర్తయిందన్నారు. నవంబరు 7న ప్రారంభమైన అక్టోబర్ విప్లవం నూతన సమాజానికి నాంది పలికిందని తెలిపారు. ఈ విప్లవం వల్ల పేదరికం, నిరుద్యోగం, నిరక్ష్యరాస్యత, అనారోగ్యం వంటివి తక్కువ కాలంలో పరిష్కారమయ్యాయన్నారు. అమెరికాతో పోటీ పడేలా సోవియట్ యూనియన్ ఎదిగిందన్నారు. మన దేశంలో స్వాతంత్ర్యం వచ్చి 75 సంవత్సరాలు దాటినా నేటికీ పేదరికం, నిరుద్యోగం, విద్య, వైద్యం, స్త్రీ, పురుషుల అసమానతలు వంటివి కొనసాగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మోడీ నుంచి ఈ దేశాన్ని కాపాడుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు అడ్డగర్ల అజయకుమారి, గార రంగారావు, వి.వెంకటేశ్వరరావు, సింగులూరి సత్యనారాయణ, కె.ధనలక్ష్మి, శ్రీను పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం : రష్యా విప్లవ దినోత్సవాన్ని తాడేపల్లిగూడెం సిఐటియు పట్టణ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవనంలో సోమవారం జవ్వాది శ్రీను అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సిఐటియు జిల్లా కార్యదర్శి కర్రి నాగేశ్వరరావు, పట్టణ కార్యదర్శి కరెడ్ల రామకృష్ణ, ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి షేక్‌వలి, సిసిఎం పట్టణ నాయకులు పి.వేణుగోపాల చౌదరి హాజరై మాట్లాడారు. రష్యా కమ్యూనిస్టు పార్టీ మనదేశంలో అనేక పరిశ్రమలకు, ప్రాజెక్టులకు నిధులు కల్పించి ఈ దేశం అభివృద్ధికి పాటుపడిందన్నారు. విశాఖపట్నం ఉక్కు పరిశ్రమకు టెక్నాలజీని అందించిందని తెలిపారు. 1985లో రష్యాలో కమ్యూనిస్టు పార్టీ కూలిపోయిన తర్వాత పెట్టుబడిదారీ దేశాలు బరితెగించి అభివృద్ధి చెందిన దేశాల మీద పెద్ద ఎత్తున దాడి చేస్తున్నాయని, ఈ దాడిని అన్ని వర్గాల ప్రజలు తిప్పికొట్టాలని కార్మికులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఎస్.శేషుబాబు, జి.నాగేశ్వరరావు, ఎం.రమణ, పి.పైడియ్య, సిహెచ్.రాము, కె.వెంకటేశ్వరరావు, కె.నానాజీ, పి.రమణ పాల్గొన్నారు.

ఆకివీడు : అక్టోబర్ విప్లవం రష్యాలో ఎన్నో మార్పులను తెచ్చిందని, ఆ మార్పు రష్యా అభివృద్ధికి ఎంతగానో తోడ్పడిందని సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు బొక్క సత్యనారాయణ అన్నారు. రష్యా అక్టోబర్ విప్లవం సందర్భంగా స్థానిక కార్మిక నగర్ సిపిఎం స్తూపం వద్ద ఆ పార్టీ జెండాను బొక్క సత్యనారాయణ ఆవిష్కరించారు. అనంతరం పార్టీ పట్టణ కార్యదర్శి నాయుడు అధ్యక్షతన సభ నిర్వహించారు. అ సందర్భంగా పలువురు మాట్లాడుతూ దేశంలో కార్మికులు పోరాడి సాధించుకున్న హక్కులను బిజెపి కాలరాస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో వెంకీ, అప్పారావు, సందక సూరిబాబు, బోడ్డుపల్లి రాంబాబు, డోకల రవితేజ, బివి.వర్మ, గేదెల ధనుష్ , గోపిశెట్టి రాము పాల్గొన్నారు.

'ఫ్యామిలీ డాక్టర్' సేవలు వినియోగించుకోండి

నెలమూరులో పరీక్షలు చేస్తున్న 104 వైద్యులు



విద్యార్థులను పరీక్షిస్తున్న వైద్యులు

ప్రజాశక్తి - పెనుమంట్ర

ఫ్యామిలీ ఫిజీషియన్ విధాన వైద్య సేవలు ప్రతిఒక్కరూ వినియోగించుకోవాలని ఆలమూరు పిహెచ్‌సి డాక్టర్ ఎంజి.నాయుడు అన్నారు. మండలంలోని నెలమూరు గ్రామంలో సోమవారం వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా నాయుడు మాట్లాడుతూ 104 డాక్టర్ జి.అనూష ద్వారా గ్రామంలో 16 మంది గర్భిణులకు, 17 మంది బాలింతలకు, 12 మంది కిశోర బాలికలకు, ఆరుగురు అనారోగ్య బాధితులకు, ఆరుగురు ఆరోగ్యశ్రీలో చికిత్స పొందుతున్న వారికి షుగర్, బిపితో పలు పరీక్షలు చేసి మందులు అందించారు. ఈ కార్యక్రమంలో ఎఎన్ఎం అరుణ, సుశీల, ఎంఎల్‌హెచ్‌పి ఎన్ వెన్నెల, ఎంపిహెచ్ఎస్ఎం పెద్దిరావు, ఆశావర్కర్లు, అంగన్‌వాడీ టీచర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం టౌన్ : ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమంలో భాగంగా సోమవారం మాధవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ సిహెచ్.శైలజ, 104 డాక్టర్ ప్రవీణ్‌కుమార్ కలిసి అప్పారావుపేట, వెంకట్రావు పాలెం, గొల్లగూడెం గ్రామాల్లో పర్యటించి సుమారు 90 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందించారు. అనంతరం అంగన్‌వాడీ పాఠశాలను సందర్శించి అక్కడి పిల్లలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి కృపావరం, ఆరోగ్య పర్యవేక్షకుడు రామకృష్ణ, హెల్త్ అసిస్టెంట్ రామకృష్ణ, ఎంఎల్‌హెచ్‌పి హెచ్‌పి.రూత్, విహెచ్ఎస్.పరువులమ్మ పాల్గొన్నారు.

16, 17 తేదీల్లో కెవిపిఎస్ జిల్లా మహాసభ

ప్రజాశక్తి - పాలకొల్లు

ఈ నెల 16, 17 తేదీల్లో భీమవరం పట్టణంలో నిర్వహించే కెవిపిఎస్ జిల్లా మహాసభను జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దిగుపాటి రాజగోపాల్, కె.క్రాంతి బాబు పిలుపునిచ్చారు. స్థానిక అంబేద్కర్ భవనంలో కెవిపిఎస్ మండల ముఖ్య కార్యకర్తల సమావేశం పి.శ్యాంబాబు అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజగోపాల్, క్రాంతి బాబు మాట్లాడుతూ 1998లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కెవిపిఎస్ ఏర్పడిందని తెలిపారు. సమాజంలో కుల వివక్ష, అంటరానితనం, ఆర్థిక అసమానతలపై నిరంతరం రాజీలేని పోరాటాన్ని కెవిపిఎస్ చేస్తోందన్నారు. జిల్లాలో దళితపేటలకు కావాల్సిన కనీస మౌలిక సదుపాయాలపై నిరంతరం పోరాటం చేస్తుందన్నారు. దళితులు ఎదుర్కొనే కుల వివక్ష, అంటరానితనం వంటి అవమానాలు, ఆర్థిక అసమానతలపై చర్చించి భవిష్యత్తు సామాజిక ఉద్యమ ప్రణాళికను రూపొందించుకునేందుకు ఈ నెల 16, 17 తేదీల్లో జిల్లా మహాసభను భీమవరం పట్టణంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ముఖ్య అతిథులుగా కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆంఢ్ర మాల్యాద్రి, జిల్లా అధికారులు, ప్రజా ప్రతినిధులు హాజరవుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శులు బత్తుల విజయ్‌కుమార్, కానేటి బాలరాజు, జిల్లా కమిటీ సభ్యులు తనుకుల చంటి, మండల నాయకులు చవ్వాకుల రామారావు, మనిరాజు, బాలరాజు, గంట విజయ్ కుమార్, పెద్దిరాజు పాల్గొన్నారు.

ఆచంటలో వింత కంద

ప్రజాశక్తి - ఆచంట

వింత కందతో రైతు

ఆచంట పంచాయతీ పరిధి మానేవారిపాలెం, లింగరాజు చెరువు సమీపంలో రైతులు కడలి సత్యనారాయణ, గుబ్బల కృష్ణమూర్తిలకు చెందిన కొబ్బరి చెట్ల దిబ్బల్లో వింత కంద చూపరులను ఆకట్టుకుంటుంది. కంద మొక్క మొదటిగా గొడుగు ఆకారంలో వచ్చిందని అనంతరం కొన్నిరోజుల తర్వాత కంద దుంప నుంచి సుమారు ఒక గజం వరకు పొడవుగా ఏర్పడి అనంతరం అరటి గెల మాదిరిగా కాయలు ఏర్పడి వింతగా చూపరులను ఆకట్టుకుంటుందని రైతు కడలి సత్యనారాయణ తెలిపారు. ఈ కందను స్థానికులు ఆసక్తిగా తిలకిస్తున్నారని చెప్పారు.

విద్యుత్ రాయితీ వర్తింపజేయాలని వినతి

ప్రజాశక్తి - పెనుమంట్ర

ఆక్వా చెరువుకు విద్యుత్ రాయితీ అందించాలని కోరుతూ పొలమూరు మాజీ ఉప సర్పంచి మేనేడి సత్యనారాయణ సోమవారం స్పందన కార్యక్రమంలో తహశీల్దార్ దండు అశోక్‌వర్మకు వినతిపత్రం అందించారు. భీమవరం గ్రామానికి చెందిన మంగం వెంకట్రావుతో మరికొందరికి చెందిన సుమారు 1 ఎకరం 91 సెంట్లు ఐదేళ్లుగా లీజుకు తీసుకుని ఆక్వా సాగు చేస్తున్నట్లు చెప్పారు. మార్చి 2022 వరకు రాయితీ వచ్చిందని, ఏప్రిల్ నుంచి రావడం లేదని తెలిపారు. అధికారులు స్పందించి రాయితీ వర్తింపచేయాలని కోరారు.

కో-ఆపరేటివ్ సర్వీస్ అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి - భీమవరం

కో-ఆపరేటివ్ సర్వీస్ అసోసియేషన్ భీమవరం శాఖ నూతన కార్యవర్గాన్ని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకైంది. జిల్లా అధ్యక్షునిగా ఎస్.శ్రీనివాసరావు, సహాధ్యక్షునిగా జె.వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షునిగా కె.జోసెఫ్‌పాల్, కార్యదర్శిగా జి.సత్యనారాయణ, కోశాధికారిగా కె.ఫణికుమార్, సంయుక్త కార్యదర్శులుగా కె.రాధాకృష్ణ, కె.సాయిమాధవి, కేడర్ కార్యదర్శిగా శ్రీనివాస్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా వారిని పలువురు అభినందించారు. ఎన్నికల అధికారిగా ఎ.ధర్మారావు వ్యవహరించారు.

పలుచోట్ల అన్నసమారాధనలు

ప్రజాశక్తి - పాలకొల్లు

కార్తీక సోమవారం సందర్భంగా పాలకొల్లులో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. క్షీర రామలింగేశ్వర స్వామి ఆలయానికి వివిధ జిల్లాల నుంచి ఇతర రాష్ట్రాల నుంచి యాత్రికులు విచ్చేశారు. పలువురు దాతలు బాదంపాలు, ప్రసాదాలు ఏర్పాటు చేశారు. దేవస్థానం రేపాక వారి సత్రంలో ఉచిత భోజనాలు ఏర్పాటు చేసింది. వస్త్ర వ్యాపారి బాలి ఏడుకొండలు ఉచిత భోజనాలు ఏర్పాటు చేశారు. ఆలయ ఛైర్మన్ కోరాడ శ్రీనివాస్, ఇఒ యాళ్ల సూర్యనారాయణ ట్రస్టీలు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

పాండురంగ కళ్యాణ మహోత్సవం

మొగల్తూరు : మండలంలోని కెపిపాలెం సౌత్ బీచ్ ప్రాంతంలో ఉన్న పాండురంగ స్వామి ఆలయ ప్రాంగణంలో సోమవారం భారీ అన్నసమారాధన నిర్వహించారు. రుక్మాబాయి సమేత పాండురంగ స్వామి ఆలయ పదో వార్షికోత్సవం సందర్భంగా ఆలయ ప్రాంగణంలో స్వామివారి కళ్యాణ మహోత్సవాన్ని గ్రామానికి చెందిన అందే రంగారావు కుమారుడు అందే కాశీ విశ్వేశ్వరరావు దంపతులు, కుటుంబ సభ్యులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన అన్నసమారాధనలో అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొని అన్నప్రసాదాలను స్వీకరించారు.

మండలంలోని గ్రామాల్లోని శివాలయాల్లో సోమవారం యాత్రికులు పోటెత్తారు. కార్తీక మాసంలో పౌర్ణమి, రెండో సోమవారం కావడంతో యాత్రికులు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు అభిషేకాలు చేశారు. యాత్రికులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా ఆలయ సిబ్బంది ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఆలయ ప్రాంగణంలో ప్రసాద వితరణ తదితర సేవా కార్యక్రమాలు నిర్వహించారు.

అఖండ జ్యోతి ప్రజ్వలన

ఆచంట : ప్రసిద్ధి పుణ్యక్షేత్రమైన ఆచంట శ్రీ రామేశ్వర స్వామి ఆలయంలో కార్తీక పౌర్ణమి సందర్భంగా సోమవారం అఖండ జ్యోతి ప్రజ్వలన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. స్థానిక గొడవర్తి వెంకన్న బాబు, లక్ష్మీపద్మావతి దంపతులు సోమవారం సాయంత్రం వేదమంత్రోచ్ఛారణల మధ్య జ్యోతిని వెలిగించారు. ఈ సందర్భంగా స్వామివారి ఆలయం యాత్రికులతో పోటెత్తింది. ముందు రోజు సుమారు పదివేల మంది యాత్రికులు ఈ అఖండ జ్యోతిని దర్శించుకున్నట్లు ఆలయ కమిటీ ఛైర్మన్ నెక్కంటి రామలింగేశ్వరరావు, ఆలయ కార్య నిర్వహణ అధికారి రామచంద్రకుమార్ తెలిపారు. అనంతరం శ్రీ చంద్ర శేఖర స్వామి వారి ప్రభోత్సవం పురవీధుల గుండా ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌ఎ తనయుడు చెరుకువాడ నరేష్‌కుమార్, రాష్ట్ర కార్యదర్శి వైట్ల కిషోర్‌కుమార్, సర్పంచి కోట సరోజినీ వెంకటేశ్వరరావు, గొడవర్తి శ్రీరాములు, విద్యాసాగర్, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు పాల్గొన్నారు. ఎస్ఐ బిఎస్‌డిఆర్.ప్రసాద్ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

జిల్లా పోటీలకు 9న ఎంపికలు

ప్రజాశక్తి - భీమవరం రూరల్

ఈ నెల తొమ్మిదో తేదీన భీమవరం బ్రౌనింగ్ స్కూల్ గేమ్స్ అండర్-19 బాల బాలికల క్రీడా పోటీలకు జిల్లా జట్ల ఎంపికలు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ రంపా ఎలిషా తెలిపారు. బ్రౌనింగ్ కళాశాలలో ఆర్చరీ, జిమ్నాస్టిక్స్, రోప్ స్కిప్పింగ్, ఫెన్సింగ్, నెట్‌బాల్, మాల్కంబ్ క్రీడల్లో బాలి బాలికలకు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా జట్లకు ఎంపికలు నిర్వహించనున్నామని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాల అండర్ 19 స్కూల్ గేమ్స్ కార్యదర్శులు జయరాజ్, కుమార్ తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు బోనఫైడ్, ఆధార్, పదో తరగతి మార్క్స్ లిస్ట్ జిరాక్స్ కాపీలతో హాజరు అవ్వాలని, వివరాలకు కళాశాల పీడీ సాయి దావుద్ 9885886722 సంప్రదించాలని తెలిపారు.

వైసిపి పాలనలో రైతులు దిగాలు : పాతూరి

ప్రజాశక్తి - పెంటపాడు

సిఎం వైఎస్.జగన్మోహన్‌రెడ్డి పాలనలో ధాన్యం రైతులు దిగాలు చెందుతున్నారని తెలుగు రైతు జిల్లా అధ్యక్షులు పాతూరి రాంప్రసాద్ చౌదరి అన్నారు. పెంటపాడు మండలంలోని మౌంజిపాడు గ్రామంలో వ్యవసాయ క్షేత్రాలను ఆయన సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు అమ్ముకున్న ధాన్యానికి సకాలంలో డబ్బులు రాలేదన్నారు. సాగును నమ్ముకుని సేద్యం చేసిన కౌలు రైతుల పరిస్థితి దయనీయంగా మారిందన్నారు. అనంతరం తెలుగు రైతు జిల్లా అధ్యక్షులు పాతూరి రాంప్రసాద్ చౌదరి మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. వైసిపి రైతు వ్యతిరేక పాలన సాగిస్తోందన్నారు. సిఎం జగన్ అమలు చేస్తున్న విధానాల వల్ల రైతులు నానా అవస్థలు పడుతున్నారన్నారు. తేమ శాతం 17 ఉంటేనే ధాన్యానికి మద్దతు ధర ఇచ్చి కొనుగోలు చేస్తామని ప్రభుత్వం ఆంక్షలు విధించి రైతులను ఇబ్బందులకు గురి చేస్తుందన్నారు. ధాన్యం ఆరబెట్టడానికి రైతులకు అదనపు ఖర్చు అవుతుందన్నారు. తేమ శాతంతో సంబంధం లేకుండా మద్దతు ధర ఇచ్చి ధాన్యం కొనుగోలు చేయాలని కోరారు. ప్రభుత్వం స్పందించి రైతుల సమస్యలను పరిష్కరించాలని కోరారు.

KANAKADURGA
FINAN CE LIMITED
(RBI ద్వారా గుర్తింపు పొందినది)
బ్రాంచిఆఫీస్ : సుబ్బమ్మదేవి హైస్కూల్ రోడ్డు, జెడ్‌ల్యాబ్స్ ఎదురు, ఆర్ఆర్‌పేట, ఏలూరు.
బ్రాంచిఆఫీస్ : ఏలూరురోడ్డు, లక్ష్మీథియేటర్ ఎదురు, జంగారెడ్డి గూడెం.
1st ఫ్లోర్, సుబ్బారావుపేట,కమల హాస్పిటల్స్ ఎదురు, తాడేపల్లిగూడెం
1st ఫ్లోర్, బస్‌స్టాప్ ఎదురు, దేవరపల్లి.
1st ఫ్లోర్, వెంకన్నప్లాజా, కప్పలవెంకన్న సెంటర్,వేల్పూరురోడ్డు, తణుకు
బంగారు వేలం ప్రకటన
ఈ ప్రకటన ద్వారా ప్రజలకు తెలియజేయునది ఏమనగా ది. 25.11.2022 ఉ॥ 10-00 గం॥లకు మా బ్రాంచి ఆఫీసు నందు 648.41 గ్రాముల వస్తువులు కుదవపెట్టిన పాత బంగారం నగలు హెడ్డాఫీసు : డోర్ నెం.54-9-23, 100 అడుగుల రోడ్డు, ఆటోనగర్, విజయవాడ-7 నందు వేలం వేయబడుతున్నాయి. వేలం వేయబడుతున్న నగలు వినియోగదారులు సమయం దాటిపోయిన విడిపించు కోకుండా వదిలిపెట్టిన నగలు అప్పులు తీసుకున్న వారందరికీ మా వేలం నోటీసులు రిజిష్టర్ పోస్టుద్వారా పంపించడం జరిగింది. వేలంలో పాల్గొనదలచిన వారు తమ అడ్రస్ ప్రూఫ్ మరియు ఐడి ప్రూఫ్ వెంకట తీసుకొని రావాలి. సెక్యూరిటీ డిపాజిట్ మరియు టోకెన్ ఇవ్వడం అనేది కంపెనీ నిర్ణయంపై ఆధారపడి ఉంటుంది. మరిన్ని వివరాలు మరియు నియమ నిబంధనల కొరకు దయచేసి విజయవాడలో మా హెడ్డాఫీసులో సంప్రదించండి.
ఆథరైజ్డ్ ఆఫీసర్
కనకదుర్గా ఫైనాన్స్ లిమిటెడ్
H.O. : 100 అ॥ రోడ్డు, ఆటోనగర్, విజయవాడ-7.
Cell : 8008812798

మహారాజశ్రీ 2వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి, భీమవరం
O.S. 81/2022

బిట్వీన్:
కొత్తపల్లి బంగార్రాజు -వాది
మరియు
కొత్తపల్లి వీర హనుమాన్‌రాజు, వగైరాలు -ప్రతివాదులు

To:
2వ ప్రతివాది:
కొత్తపల్లి జ్యోతి కుమార్‌రాజు, S/o. వీర హనుమాన్‌రాజు, 43 సం॥లు, ఇంటి నెం. 11-100, మెయిన్‌రోడ్డు, పాలకోడేరు గ్రామం మరియు మండలం, భీమవరం జిల్లా, PC No. 534210.

పై నెంబరు దావాలో మీకు సమను అమలు నిమిత్తం యీ ప్రకటన ద్వారా మీకు తెలియజేయునది ఏమనగా పై కేసులో మీ హాజరు నిమిత్తం **ది. 07-12-2022కు** వాయిదా వేసినారు. కావున సదరు **తేదీన ఉదయం 10.30 గంటలకు** పై కోర్టు వారి ఎదుట మీరు స్వయంగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని హాజరై తమ ఆక్షేపణలు తెలియజేసుకోవలెను. లేని యెడల మీ పరోక్షమున తీర్మానించబడునని తెలియజేయడమైనది.

(శ్రీ కోర్టు వారి అనుమతిన)
కుచ్చర్లపాటి రామకృష్ణంరాజు
పత్సమట్ల మురళీకృష్ణ సుబ్బరాజు
అడ్వకేట్స్, ముమ్మిడివరం
సెల్: 9440341961

మహారాజశ్రీ 2వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి, భీమవరం
I.A. 25/2022, O.S. 81/2022

బిట్వీన్:
కొత్తపల్లి బంగార్రాజు -పిటీషనరు
మరియు
కొత్తపల్లి వీర హనుమాన్‌రాజు, వగైరాలు -రెస్పాండెంట్లు

To:
2వ రెస్పాండెంటు:
కొత్తపల్లి జ్యోతి కుమార్‌రాజు, S/o. వీర హనుమాన్‌రాజు, 43 సం॥లు, ఇంటి నెం. 11-100, మెయిన్‌రోడ్డు, పాలకోడేరు గ్రామం మరియు మండలం, భీమవరం జిల్లా, PC No. 534210.

పై నెంబరు దావాలో మీకు నోటీసు అమలు నిమిత్తం యీ ప్రకటన ద్వారా మీకు తెలియజేయునది ఏమనగా పై కేసులో మీ హాజరు నిమిత్తం **ది. 07-12-2022కు** వాయిదా వేసినారు. కావున సదరు **తేదీన ఉదయం 10.30 గంటలకు** పై కోర్టు వారి ఎదుట మీరు స్వయంగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని హాజరై తమ ఆక్షేపణలు తెలియజేసుకోవలెను. లేని యెడల మీ పరోక్షమున తీర్మానించబడునని తెలియజేయడమైనది.

(శ్రీ కోర్టు వారి అనుమతిన)
కుచ్చర్లపాటి రామకృష్ణంరాజు
పత్సమట్ల మురళీకృష్ణ సుబ్బరాజు
అడ్వకేట్స్, ముమ్మిడివరం
సెల్: 9440341961